మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ప్రజా పాలనతో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలి
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 22 ప్రభాతవార్త:** ప్రజాపాలనలో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా అధికారులు, ప్రజాప్రతి నిధులు సమన్వయంతో పని చేయాలనిరాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే జిల్లా అభివృద్ధి వేగంగా జరుగుతుందనిమంత్రి పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థ వంతంగా చేరేలా కృషి చేసి, నాగర్‌కర్నూలు జిల్లాకు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకురా వాలని సూచించారు. ప్రజల సమస్యలను త్వరగాపరిష్కరించడం,అభివృద్ధి కార్యక్రమాలను సమర్థ వంతంగా అమలు చేయడం ద్వారా ప్రజా పాలనను ఆదర్శంగా నిలపాలని మంత్రి ప్రజా ప్రతినిధులు, అధికారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా జిల్లా కేంద్రంలోని గగ్గలపల్లి తేజ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాస్థాయి ప్రజా పాలన సమావేశాన్నిరాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డిలతో జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా స్థాయి ప్రజా పాలన సమావేశాన్ని ప్రారంభించారు. ముందుగా తెలంగాణ జాతీయ గీతాలాపనతో ప్రారంభమైన కార్యక్రమం అనంతరం జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి సీతారాం నాయక్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలో మార్చ్ 6 నుంచి అమల చేసిన కార్యక్రమాలపై ఈ అవగాహన సదస్సులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పది అంశాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల పై అధికారులు శాఖల వారీగా తెలియపరిచారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం ఒక్కొక్కటి అమలు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని, మహిళల ఆర్థిక అభివృద్ధిని పెంపొందించే విధంగా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అనేక కొత్త పథకాలను అమలు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా రైతుల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ ఆర్థిక విధానాల కారణంగా రాష్ట్రంపై భారీ అప్పుల భారం పడిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేశారని మంత్రి ఆరోపించారు. ఈ అప్పుల కారణంగా ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం సుమారురూ.6500 కోట్ల వరకు వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. గతంలో22 మందిముఖ్యమంత్రులు 64 సంవత్సరాల పాలనలో మొత్తం రూ.65 వేల కోట్ల అప్పులు మాత్రమే చేశారని, కానీ గత ప్రభుత్వం కేవలం పదేళ్ల వ్యవధిలోనే భారీ అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి పెట్టిందని మంత్రి తెలిపారు. రాష్ట్రం ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం ఎలాంటి వెనుకడుగు వేయడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని తెలిపారు.ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,పేద మరియు మధ్యతరగతి కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొంటూ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించామని తెలిపారు. అదేవిధంగా, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ సామాన్య ప్రజలకు ఊరటనిస్తున్నామని చెప్పారు. పెరుగుతున్న ధరల భారాన్ని తగ్గించేందుకు రూ.500కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టామని,అర్హులైన కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. గృహ రహిత పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా స్వంత ఇల్లు కల కల్పిస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రైతు రుణమాఫీ అమలు చేస్తున్నామని, రైతు భరోసా ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. అదనంగా, సన్న ధాన్యం పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500బోనస్ అందిస్తున్నామని తెలిపారు.మహిళల ఆర్థిక స్వావలంబన కోసం వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని, స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని,పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అహర్నిశలు పని చేస్తోందని జూపల్లి కృష్ణారావు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాబోయే రెండున్నర సంవత్సరాల్లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంను ప్రారంభించేలా చర్యలు వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు.రాష్ట్రంలో అర్హత -మిగతా4లో..

# మరో కోనసీమగా నారాయణపేట

## రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



దివ్యాంగురాలికి మూడు చక్రాల వాహనం అందజేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

**నారాయణపేట, మే22 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా స్థాయి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాకిటి శ్రీహరి హాజరయ్యారు ఈ సందర్భంగా పేద ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టంచేశారు. మక్తల్-నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి దాదాపు రూ.5 వేల కోట్లతో శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రాజెక్ట పూర్తైతే నారాయణపేట ప్రాంతంమరో కోనసీమగా మారుతుందని పేర్కొన్నారు. ఇకపై నారాయణపేట వలసల జిల్లా కాకుండావలసలను ఆహ్వానించే జిల్లాగా మారుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందజేస్తామని మంత్రి తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రైతులు పండించిన ధాన్యానికి బోనస్‌తో పాటు గిట్టుబాటు ధర అందిస్తున్నామని వెల్లడించారు. ప్రతి పేదవారికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు.ప్రతి గ్రామంలో రేషన్ దుకాణాలుఉండేలాచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళలఆర్థిక స్వావలంబన కోసం ఉచితబస్సు ప్రయాణంవంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక మాట్లాడుతూ 99రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నట్లు తెలిపారు.గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీను, ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, నారాయణ పేట ,మక్తల్, కోస్గి మున్సిపల్ చైర్ పర్సన్‌లు కొండా శ్వేతా సత్య యాదవ్, వాకిటి మానస, నాగుల పల్లి నరేందర్, పేట ఏఎంసీ చైర్మన్ శివారెడ్డి, జిల్లా మత్స్య సహకార సంస్థ చైర్మన్ కాంత్ కుమార్, ఆర్టీవో మెంబర్ పోషల్ రాజేష్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, దామర గిద్ద విండో చైర్మన్ పుట్టి ఈదప్ప, స్థానిక పుర వైస్ చైర్‌పర్సన్ మంజుల, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లాఅధికారులు, జిల్లాకు చెందిన సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు,ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులుపాల్గొన్నారు.ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిహెచ్ ప్రియాంక హాజరైన అధికారులు, నాయకులు

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా విజయోత్సవాలు

- విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, మే 22, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. సందర్భంగా ఆయన కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని, విద్యార్థులు కసితో కష్టాలను అధిగమించి ఉన్నత చదువులు చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా విజయోత్సవాల్లో భాగంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభకనబరిచిన, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించినవిద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని, విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పి స్తుందని తెలిపారు.వెనకబడిన విద్యార్థుల కోసం ఇప్పటికే కృత్రిమ మేధా ద్వారా పాఠశాలల్లో విద్యాబోధన చేయడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలో ఒక్క పాఠశాల కూడా మరుగుదొడ్లు లేకుండా ఉండొద్దని, ప్రతి ఒక్క పాఠశాలలో మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకం అమలు కోసం ఎల్పీజీ కనెక్షన్లను ఇవ్వడం జరిగిందని తెలిపారు.గతేడాది పదో తరగతి పరీక్షల ఫలితాల్లో వనపర్తి జిల్లాలో 90 మంది ఉత్తీర్ణులు కాగా, ఈ ఏడాది 97 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, దీంతో వనపర్తి జిల్లా రాష్ట్రస్థాయిలో గతేడాది 28వ స్థానంలో ఉండగా ఈ ఏడాది 19వ స్థానానికి చేరుకుంది. వచ్చేయడాది జిల్లాలో 100 మంది విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి కృషితో కష్టాలను అధిగమించి ఉన్నతశిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఇగ్నైటెడ్ మైండ్స్ అనే పుస్తకాన్ని విద్యార్థులకు అందజేసిన కలెక్టర్ ప్రతిఒక్కరూ ఆ పుస్తకాన్ని చదవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రైవేటు -మిగతా4లో..

# వేసవి సెలవుల్లో దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

- నారాయణపేట జిల్లా ఎస్పీ వినీత్




**నారాయణపేట, మే 22 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో వేసవి సెలవుల నేపథ్యంలో ప్రజలు దొంగతనాలపట్ల అప్రమత్తంగా ఉండాలని డా.వినీత్ సూచించారు. పిల్లలకు సెలవులు ఉండటంతో ప్రజలు తమ స్వగ్రామాలకు, విహారయాత్రలకు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని దొంగలు నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఊరికి వెళ్లే వారు స్థానిక పోలీసులకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంట్లో బంగారం, వెండి నగలు, విలువైన వస్తువులనుబ్యాంక్ లాకర్లలో భద్రపరచడం మంచిదని తెలిపారు. ఇంటి పరిసరాలను గమనించాలని పక్కింటి వారికి చెప్పాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను ఇంటి ఆవరణలోనే పార్క్ చేయాలని, బయట ఉంచితే హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ కూడా ఉపయోగించాలని పేర్కొన్నారు.సీసీ కెమెరాలు, సెంట్రల్ లాకింగ్ వ్యవస్థ ఏర్పాటుచేసుకుంటే భద్రత మరింత మెరుగవుతుందని చెప్పారు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్100 లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 8712670399కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. దొంగతనం జరిగిన అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నీటి పాలైన మక్కలు

- అకాల వర్షంతో కొట్టుకుపోయిన మక్కలు
- బోరున విలపిస్తున్న రైతులు
- ఇది ప్రభుత్వ వైఫల్యమే.. తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని ప్రతిపక్షాల డిమాండ్



తడిసిన మక్కలు



కొనుగోలు చేసిన రిసిప్ట్

**అచ్చంపేట, మే,22 ప్రభాతవార్త:** అచ్చంపేట పట్టణంలో గురువారం రాత్రి అకాల వర్షం రావడంతో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన మక్కలు నీటిపాలు కావడం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ళముందే వరద పాలు కావడం చూసి రైతులు బోరున విలపించారు.రైతులు 40 రోజులనుండి మార్కెట్ కు మక్కలు తెచ్చినా కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని మండిపడ్డారు.నెలల తరబడి రైతులు ఆరుగాలం పండించి తెచ్చిన గింజలను అమ్ముకోవడానికి నరకయాతన అనుభవిస్తున్నారని ఇదేనా రైతు సంక్షేమ పాలన అని దుయ్యబట్టారు.ఒక వైపు గన్ని బ్యాగులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాట్లాడారు. కాంట అయిన లోడ్ అయ్యే వరకు రైతులదే బాధ్యత అని చెప్పడం వల్ల 20 నుండి 30 రోజులు కావలా ఉండడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.హమాలీల పనితీరు మరీ అధ్వాన్నంగా ఉందని చాట కూలి పేరుతో రైతులవద్ద మక్కలు అధిక మొత్తంలో దోచుతున్నారని తెలిపారు.కాంటా అయిన బ్యాగులను తరలించడంలో రవాణా సౌకర్యం లేదని రైతులను నట్టేట ముంచుతున్నారని మాటాడారు. విషయం తెలుసుకున్న సిపిఎం, నాయకులు రైతుపక్షాన నిలిచి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనలను మరిచిందన్నారు. కాంట అయిన రైతుల డబ్బులను వెంటనే రైతు ఖాతాలోకి వెయ్యాలని పేర్కొన్నారు. అదే విధంగా ఇప్పటికైనా తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చెయ్యాలని డిమాండ్ చేశారు.

**అధికారులు ఇప్పటికైనా స్పందించాలి : గుండెమోని నారయ్య, రైతు అమ్రాబాద్**



నేను మక్కలు తెచ్చి నెల కావస్తుంది.కాంట జోకీ ఇరవై రోజులు అవుతున్న బండి ఎత్తలేదు ఇక్కడ ఏమి వసతులులేవు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

**సమయానికి లోడ్ చేయడం లేదు : పర్వతాలు, రైతు అచ్చంపేట**



ఇక్కడ తెచ్చిన మక్కలు కాంట అయిన చెప్పిన సమయానికి లోడ్ చేయడం లేదు. ఎవరు డబ్బు ఆశ చూపితే వారివి లోడ్ చేస్తున్నారు. అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు.

# సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ

- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా



భాగ్యరెడ్డివర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ , తదితరులు

**మహబూబ్‌నగర్, మే22 ప్రభాతవార్త:** భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంఘ సంస్కర్త అని మహబూబ్‌నగర్ కలెక్టర్ కుష్బూ గుప్తా కొనియాడారు. ఎం.వి భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ ఆదిహిందూ ఉద్యమానికి నాయకత్వం వహించి, దళిత సమాజంలో సామాజిక చైతన్యం, విద్యాభివృద్ధి, ఆత్మగౌరవం పెంపొందించేందుకు కృషి చేశారని తెలిపారు. మేయర్ గుమ్మాల మమతా,స్థానిక సంస్థలఅదనపు కలెక్టర్ మధుసూదన్‌రెడ్డి, డిఆర్‌ఓ రామ్‌రెడ్డి, డిఆర్‌డిఓ నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులకు వెళ్ళి.. ప్రమాదవశాత్తు బావిలోపడి మహిళ మృతి

- మృతురాలు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుంది
- తహసీల్దార్ రాజు, మార్కెట్ చైర్మన్ ప్రశాంత్
- దహన సంస్కారాలకు రూ. 50 వేల ఆర్థిక సహాయం



ఉపాధి పనులకు వెళ్లి బావిలో పడి మృతి చెందిన మహిళ

**మదనాపురం, మే22 ప్రభాతవార్త:** ఉపాధి పనులకు వెళ్ళి ప్రమాదవశాత్తు బావిలోపడి మహిళ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని అజ్జకొల్లు గ్రామంలో ఉపాధి హామీ పనుల కోసం వెళ్లిన గోవిందమ్మ (55) అనే మహిళ ప్రమాదవశాత్తుబావిలో పడి మృతి చెందింది. తోటి కూలీల కథనం ప్రకారం.. రోజులాగే కావలి గోవిందమ్మ ఉదయం ఎర్ర గట్టు సమీపంలో ఉపాధి పనులకు వెళ్లింది. పనిలో భాగంగా తవ్విన మట్టిని వేయడానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బావిలో కాలుజారి పడిపోయింది. గమనించిన తోటి కూలీలు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ విషయం తెలుసుకున్న తహసిల్దార్‌రాజు, మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, అధికారులు నాయకులతో కలిసి జరిగిన సంఘటన దగ్గరికి వెళ్లి మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయంగా అధికారుల పక్షాన అందిస్తామన్నారు. దహన సంస్కారాలకు -మిగతా4లో..

# రోడ్డెక్కిన రైతన్నలు

**ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన ఎర్రటి ఎండలో 4గంటల పాటు రోడ్డుపై బైఠాయించిన రైతులు**



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

**గోపాల్ పేట, మే22 ప్రభాతవార్త :** ఉమ్మడి గోపాల్ పేట రైతులు తాము ఆరుగాలం కష్టపడి పండించిన వరి,మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని దాదాపు 4గంటల పాటు ఎర్రటి ఎండలో ధాన్యం రోడ్డుపై పారబోసి ధర్నాకిదిగారు. ధాన్యాన్ని తరుగు లేకుండా తడిసిన ధాన్యాని కూడా ప్రతి గింజతో సహా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సంఘీభావం తెలిపిన జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ మాట్లాడుతూ రైతులు ఉసురు పోసుకున్న రేవంత్ ప్రభుత్వం ఆగంకాక తప్పదని, జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేయక పోవడం వల్ల కన్నీటితో తమ పంట తగలబెట్టుకుంటే ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు.అకాల వర్షాలతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీళ్ల పాలు అవుతుంటే ప్రభుత్వం స్పందించకపోవడం సహించరానిదని దుయ్యబట్టారు.జిల్లా కలెక్టర్ వచ్చి మాకు హామీ ఇచ్చేదాకా ధర్నా విరమించమని రైతులు పట్టు బట్టారు. గోపాల్‌పేట మండలం తహసిల్దార్ తిలక్ రెడ్డి, గోపాల్‌పేటకు నూతనంగా వచ్చిన ఎస్సై శశిధర్ రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింప చేశారు.ఈ కార్యక్రమంలో రమేష్ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, మన్నేనాయక్, రాజేష్, నరసింహ ఉన్నారు.

# పోలీసులమంటూ లిఫ్ట్ అడిగి.. దారి మధ్యలో బెదిరించి దోపిడీ

- పోలీసుల అదుపులో నిందితులు
- జడ్చర్లలో ఘటన
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి వెంకటేశ్వర్లు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి వెంకటేశ్వర్లు

**జడ్చర్ల, మే22, ప్రభాతవార్త:** పోలీసులము అని చెప్పి, వాహనం ఆగిపోయిందని లిఫ్ట్ అడిగి దారి మధ్యలో ఓ వ్యక్తి నుంచి డబ్బులు దోపిడీ చేసిన ఘటన జడ్చర్లలో చోటు చేసుకున్నది. ఈ మేరకు మహబూబ్‌నగర్ డిఎస్‌పి జడ్చర్లలోశుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. వైఎస్ఆర్ కడప జిల్లా జంగాలపల్లి గ్రామానికి చెందిన సంజన్న జడ్చర్లలో నివాసం ఉంటూ పోలేపల్లి సెజ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 19న సుమారు రాత్రి 8 గంటల సమయానికి జడ్చర్ల హైవే వద్దజామ్ జామ్ హోటల్‌లో భోజనం చేసి తిరిగి ఇంటికి వెళ్తుండగా పోలీసు అని చెప్పి వాహనం ఆగిపోయిందని లిఫ్ట్ ఇవ్వమని అడిగి నక్కల బండ తండా వైపు తీసుకెళ్లారు. అక్కడ ఒక వెంచర్ వద్ద స్కూటీ లాభం అని బెదిరించాడు. వెంటనే మరొక వ్యక్తి వచ్చి ఇద్దరు కలిసి -మిగతా4లో..

## విద్యార్థులకు న్యాయం చేయాలి....

**ఆత్మకూర్ మే 22, ప్రభాతవార్త :** మహ బూబ్‌గర్ పార్లమెంట్ పరిధిలోని నవోద య వట్టెం పాఠశాలలో విద్యార్థిని విద్యా ర్థులకు జరుగుతున్న అన్యాయాన్ని నివా రించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆత్మకూర్ లిటిల్ పవర్ కోచింగ్ సెంటర్ అకాడమిక్ అడ్వైజర్ మీర్జా అన్వర్ బేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్స రం వరకు మహబూబ్నగర్ పార్లమెంటు పరిధిలో గల బట్టం ప్రవేశ పాఠశాలలో 80 మంది విద్యార్థిని విద్యార్థులకు సీట్లు కేటాయిస్తున్నారని ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి కేవలం 40 మందికి మాత్రమే ప్రవేశాలు కల్పిస్తున్న నేపథ్యంలో మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ్ ప్రత్యేక చొరవ చూపించి మిగతా 40 సీట్ల భర్తీకి చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వట్టెం నవోదయ పాఠశాలలో భవనాల కొరత ఉందని ప్రభుత్వ యంత్రాంగం చెప్తుందని అలాగైతే బాలానగర్ పరిధిలోగల పెద్దాయపల్లిలో ప్రభుత్వ భవనాలను తక్షణమే పూర్తి చేసి విద్యార్థులకు 2026. 27 విద్యా సంవత్సరానికి సంబంధించి నవోదయ పాఠశాలల్లో ప్రవేశం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బిఆర్ఎస్ పార్టీ మాజీ ఉపసర్పంచ్
## గోవర్ధన్ రెడ్డికి నివాళులర్పించిన నిరంజన్ రెడ్డి

**పెద్దమందడి, మే 22 ప్రభాతవార్త :** పెద్దమందడి మండల పరిధిలోని పామ్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ మాజీ ఉపసర్పంచ్ సందడి గోవర్ధన్ రెడ్డి ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గోవర్ధన్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మృతునికి నివాళులర్పించిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

## వరి తరలింపు వేగవంతం చేయాలి

**రైస్ మిల్లును పరిశీలించిన తహసిల్దార్ మహేష్ గౌడ్**

**మద్దూరు, మే 22 ప్రభాతవార్త :** మద్దూర్ మండలం జదవరావుపల్లి గ్రామంలోని శ్రీ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును తహసీల్దార్ మహేష్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి ఎ. ప్రవీణ్ కుమార్ సంయుక్తంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా అన్‌లోడ్ చేసి మిల్లింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మిల్ యాజమాన్యానికి సూచించారు. మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండటంతో అక్కడ ఉన్న ట్రాక్టర్లు, లారీలను వెంటనే ఖాళీ చేసి తిరిగి కేంద్రాలకు పంపాలని ఆదేశించారు. దీంతో మిగిలిన ధాన్యాన్ని కూడా వేగంగా మిల్లులకు తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ధాన్యాన్ని ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా తక్షణమే మిల్లులకు తరలించాలని అధికారులు స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు, రవాణా ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు.



రైస్‌మిల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేష్‌గౌడ్

## మొగ్దుంపూర్ జక్లేర్ బస్సు పునఃప్రారంభం

**నారాయణపేట, మే 22 ప్రభాతవార్త :** నారాయణపేట డిపో పరిధిలోని మొగ్దుంపూర్ జక్లేర్ బస్సు సేవలను పునః ప్రారంభించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా బస్సు సేవలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహాతో పాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రయాణికులు డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. పాఠశాలల పిల్లల కోసం బస్సు ఏర్పాటు చేసిన నేపథ్యంలో పాఠశాలలు ప్రారంభమైన తర్వాత సేవలు పునః ప్రారంభిస్తామని అధికారులు తొలుత తెలిపినట్లు సమాచారం. అయితే ఈ బస్సు ఎన్నో సంవత్సరాలుగా సాధారణ ప్రయాణికులకు కూడా ఉపయోగపడుతోందని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత అధికారులు మార్చి, ఏప్రిల్ నెలల కలెక్షన్లను పరిశీలించి పరిస్థితిని సమీక్షి ంచారు. ప్రయాణికులు, విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన అధికారులు బస్సు సేవలను తిరిగి ప్రారంభించారు. బస్సు పునః ప్రారంభించినందుకు ఆర్టీసీ అధికారులు, డిపో మేనేజర్‌కు ప్రయాణికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




పునః ప్రారంభమైన బస్సు

## ముఖ్యమంత్రి ప్రకటనలో స్పష్టత లేదు

**మక్తల్ టౌన్, మే 22 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోటి 11 లక్షల మంది కార్మికులకు వేతనాలు పెంచుతున్నానంటూ నిన్న చేసిన ప్రకటనలో గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు జోన్లుగా ప్రకటించడం, ప్రకటించిన వేతన పెంపులో సమగ్రత, స్పష్టత లేదని కిరణ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయి మెంట్లు ఉండగా వాటిల్లో ఐదు జీవోలకు 2021లో బేసిక్ వేతనం 18000గా నిర్ణయించగా రాష్ట్ర ముఖ్యమంత్రి దానిని తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. బేసిక్ వేతనం గురించి మాట్లాడకుండా, కొత్త ప్రతిపాదనలతో ముందుకు రావడం అనేక అనుమానాలకు దారి తీస్తుందన్నారు. ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ జీవో 11 ప్రకారం నేడు అనగా స్కేలు 13,098, సెమి స్కేలు 14,287, స్కేలు 15,476, హైలీ స్కేలు 23,683 ప్రస్తుతం చెల్లిస్తుండగా ముఖ్యమంత్రి ప్రకటించిన దాంట్లో రూ.20 వేలుగా ప్రకటించారు. దీనితో రూ.23,683 వస్తున్నా హైలీ స్కేల్కు 3,683లు కోత విధించారు. గ్రామీణ కార్మికులు అంటే ఎవరు అనేది కూడా స్పష్టత లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్స్ ఉద్యోగుల వేతనాల పెంపును (జీవో నెంబర్ 60) రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.



టీయుసీఐ కిరణ్

## రైతులను మోసం
## చేస్తున్న రైస్ మిల్లుల యజమానులు

**ఖిల్లా గణపురం మే 22, ప్రభాతవార్త;** రైతులను నిలువునా మోసం చేస్తూ తరుగు పేరు మీద లక్షల రూపాయలు కుల్లగొడుతున్నారని మండల బిజెపి నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక తహసిల్దార్ సుగుణకు రైస్ మిల్లుల వద్ద జరుగుతున్న మోసాలపై ఫిర్యాదు చేశారు. రైతులకు కల్లాల ఏర్పాటుతోపాటు నీడ సౌకర్యం తాగునీటి సౌకర్యంతో పాటు సుతిలీలు రవాణా సౌకర్యం హమాలీల ఖర్చులు కూడా భరించాలని జీవో ఉందని కానీ అలా కాకుండా ఈ డబ్బులన్నీ రైతుల నుండే రైస్ మిల్ యజమానులతో పాటు ఐకెపి సెంటర్ వాళ్ళు వసూలు చేస్తున్నారని బిజెపి నాయకులు బుచ్చిబాబు గౌడ్ అన్నారు. తూకం చేసేటప్పుడు ఒక్కో బ్యాగులో 41. 300 గ్రాములు కాంట వేసి అదనంగా 1300 గ్రాములు తీసుకుంటున్నారని మరి సంచి తరుగు తీసివేయగా క్వింటాల్కు రెండు కిలోలు తీసుకుంటున్నారని దీంతో పాటు రైస్ మిల్లు వద్ద తాలు మట్టి ఉందని క్వింటాలకు రెండు మూడు కిలోలు తరుగును తీసివేస్తున్నారని దీంతో రైతులు లబోదిబోమంటున్నారు అని చెప్పారు. స్థానిక ఎస్వీఎస్ రైస్ మిల్లు కు ఈ నెల 19న 217 సంచులు గొల్ల కేశవులు అనే రైతు ధాన్యం తీసుకుపోయాడని బస్తాలను దాదాపు 50 కిలోలకు పైగా తరుగు తీస్తామని చెప్పడంతో ఎమ్మార్వో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ విషయంలో జిల్లా అధికారులు పట్టించుకోని గత నెల రోజులుగా జరుగుతున్న ఈ మోసాలపై విచారణ చేసి రైతులకు తగు న్యాయం జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెన్నూరు ఆశన్న, నారాయణ, గోపి, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

# ఘనంగా అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం

**పెయింటింగ్ పోటీలకు అనూహ్య స్పందన , డా.బిఆర్ఆర్ కళాశాలలో 1000 ఔషధమొక్కల పంపిణీ**

**జడ్చర్ల, మే 22, ప్రభాతవార్త :** అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ బొటానికల్ గార్డెన్, అసోసియేషన్ ఫర్ బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అండ్ డెవలప్మెంట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పెయింటింగ్ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. జీవవైవిధ్యాన్ని దాని ప్రాముఖ్యతను విద్యార్థులలో చొప్పించడానికి జీవవైవిధ్య సంరక్షణలో పాఠశాల పాత్ర అనే అంశాన్ని పెయింటింగ్ పోటీలకు ఇచ్చినట్టుగా తెలంగాణ బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా. బి.సదాశివయ్య తెలిపారు. కళాశాలలోని సెమినార్ హాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. గరిష్ట సంఖ్యలో 100 మంది విద్యార్థులు జడ్చర్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ప్రాంతాలలో చదువుతున్న జడ్చర్లలో నివాసముంటున్న విద్యార్థిని విద్యార్థులు అందరూ ఈ పోటీలలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బొటానికల్ గార్డెన్‌ను చూపించి దానికి అనుబంధంగా ఉన్న జీవవైవిధ్య పరిశోధన విద్యా కేంద్రంలో పాములపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా ఎంతో సంతోషంతో పాములను పట్టుకోవడంలో ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ముగింపు సభలో అధ్యక్షత వహించిన కళాశాలప్రిన్సిపల్ ప్రొ॥.జి. సుకన్య మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న కళాత్మక నైపుణ్యాలను వెలికితీయడం కోసమే ఈ పెయింటింగ్ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. చదువు మాత్రమే కాకుండా చదువుతో పాటు ఇతర కలలలో పట్టు సాధించడం వల్ల లోకజ్ఞానం పెరగడమే కాకుండా మానసికంగా ఉల్లా సంగా ఉండడానికి కళలు దోహదపడతాయని ఆమె తెలియజేశారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్ అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన కిరణ్మయి, భావన, గోనెల రవిశంకర్‌ను కళాశాల ప్రిన్సిపపాల్ సదాశివయ్య సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్‌తో పాటు నోటు పుస్తకాలు పెన్ను టోపీలు బహుమానంగా అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్నప్రతి విద్యార్థికి వారి తల్లిదండ్రులకు సుమారు 1000 ఔషధ మొక్కలు పంపిణీ చేశారు. జూనియర్ విభాగంలో..మొదటి బహుమతిచిక్క భవిష్య, రెండవ బహుమతి నైనిక, తృతీయ బహుమతి కార్తీక్ ఆర్యన్, సబ్ జూనియర్ విభాగంలో మొదటి బహుమతిహన్సిక రెండవ బహుమతి బ్లెస్సి మూడవ బహుమతి రిషిత, జ్యోతిర్మయి, సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతి అఫ్సా తరున్నం, ద్వితీయబహుమతిసాయి ప్రియదర్శిని, తృతీయ బహుమతి ప్రణవి పొందారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పరిశోధక విద్యార్థులు రమాదేవి, రాహుల్, వీరాంజనేయులు, రవీందర్, సంస్కార్ స్కూల్ కరెస్పాండెంట్ గడ్డం సందీప్ పాల్గొన్నారు.



పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

# పియూలో నూతన కోర్సులను ప్రవేశపెట్టాలి

**మహబూబ్‌నగర్, మే 22 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీలో వచ్చే విద్యా సంవత్సరంలో నూతన కోర్సులను ప్రవేశ పెట్టాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ పాలమూరు యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ప్రొ॥ రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీనీ కొన్ని కోర్సులతోనే ప్రారంభించుకుని నేటికి అనేక కోర్సులతో వేల సంఖ్యలో విద్యార్థులను కలిగి ఉన్న విశ్వవిద్యాలయం దినదిన అభివృద్ధి చెందాలంటే మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అందులో భాగంగా గత నాలుగేళ్ల క్రితం మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటుకు యూనివర్సిటీ ఆమోదం తెలిపినప్పటికి సాంకేతిక కారణాల చేత అది ప్రారంభం కాలేదని కానీ దేశవ్యాప్తంగా (ఎన్ సి టి ఈ) ఎంపిఈడి కోర్సుకు 2026,27 విద్యా సంవత్సరానికి దరఖాస్తు నిర్వహిస్తుందని యూనివర్సిటీ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడా రంగాలలో రాణించాలంటే ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్స్ చాలా ముఖ్యమని తక్షణమే కోర్సును ప్రారంభించాలని అదేవిధంగా సివిల్స్ ,గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు ఎంతో ప్రాముఖ్యం కలిగిన చరిత్ర, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జర్నలిజం వంటి కోర్సులను కూడా ప్రారంభించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలలో ఎక్కడ ఈ కోర్సులు లేవని వీటిని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వేలాది మంది విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పియు కార్యదర్శి బత్తిని రాము, ఉపాధ్యక్షుడు సుధాకర్, సహాయ కార్యదర్శి తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

# ఎన్టీఆర్‌లో దోస్త్ ఫేస్1 సెల్ఫ్ రిపోర్టింగ్‌కు నేడు అఖరు

**కొత్త కోర్సులు ఉపాధికి మార్గాలు : కళాశాల ఇంఛార్జ్ ప్రిన్సిపాల్ అమీనా ముంతాజ్ జహాన్**

**మహబూబ్‌నగర్, మే 22 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా మహిళా డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో 2026, 27 విద్యా సంవత్సరంలో దోస్త్ అడ్మిషన్లలో భాగంగా ఫేజ్1 లో కేటాయించిన సీట్లలో 75 మంది విద్యార్థినిలు సీటు అలాట్ చేసుకోవడం జరిగిందని, వారిలో చాలా మంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకున్నట్లు కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ అమీనా ముంతాజ్ జహాన్ తెలిపారు. నేటితో సెల్ఫ్ రిపోర్టింగ్ కు ఆఖరి అవకాశం అని ఇంకా మిగిలిన విద్యార్థులందరూ నేడు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలన్నారు. అలాగే దోస్త్ లో రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి రెండవ విడత ఈ నెల 26 వరకు అవకాశం ఉందని రిజిస్ట్రేషన్ చేసుకుని వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ అమీనా ముంతాజ్ జహాన్ తెలిపారు. అలాగే అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డా.ఎం.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుండి ఏఈడిపిలో కొత్తగా 2 స్కిల్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. లైఫ్ సైన్సెస్ విద్యార్థులకు హెల్త్‌కేర్, కామర్స్ విద్యార్థులకు బిఎఫ్ఎస్ఐ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కొత్తగా పలు డిగ్రీ కోర్సులతో పాటు నైపుణ్యాదారిత కోర్సులను రాష్ట్రప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు ఈకోర్సుల్లో చేరగోరే విద్యార్థులు దోస్త్ 2026 ద్వారా కళాశాలలో అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు హెల్త్‌కేర్, బిఎఫ్ఎస్ఐ కోర్సుల్లో ప్రథమ ద్వితీయ సంవత్సరాలలో అభ్యసన కార్యక్రమాలు ఉంటాయని మూడవ సంవత్సరంలో గుర్తింపు పొందిన కంపెనీలు, సంస్థలు, కార్పొరేట్ హాస్పిటల్‌లోవేతనాలతో కూడిన ఇంటర్న్ షిప్ ఇవేకాకుండా బిఏ, బీఎస్సీ, బీకాంలో అనేక కాంబినేషన్లతో కూడా డిగ్రీ కోర్సులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు అధిక సంఖ్యలో చేరి విద్యా అవకాశాలను, ఉద్యోగ అవకాశాలను పొందాలన్నారు.



# బీడీ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

**చర్చలు విఫలమైతే సమ్మె తప్పదు ; టీయుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యం**

**చిన్న చింతకుంట, మే 22 ప్రభాతవార్త :** బీడీ కార్మికుల జీవితాలు మసకబారిపోతున్న బీడీ యజమాన్యాలు మొండిగా వ్యవహరిస్తుండడంతో బీడీ కార్మికులు పోరాటాలకు సిద్ధమవుతున్నారని టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కె. సూర్యం హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెడ్డి బీడీ ఫ్యాక్టరీలో బీడీ కార్మికులతో గేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో 1000 బీడీలకు 275 రూపాయల 23 పైసలు కూలి ఇస్తున్నారన్నారు. మరి మనప్రాంతంలో కేవలం రూ. 230లు మాత్రమే కూలి ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆయన విమర్శించారు. గత మూడుదఫాలుగా చర్చలు కొనసాగితే బీడీ యజమాన్యాలు 10 రూపాయలే పెంచుతామని మొండి వైఖరి అవలంబిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 రూపాయల పెంపు ప్రతిపాదనను కార్మిక సంఘాల నేతలు తిరస్కరించారు. న్యాయమైన సరిపడే విధమైన కూలి పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. బీడీ యజమాన్యాలు తగిన విధమైన వేతనాలు పెంచనిచో కార్మిక సంఘాలు ఇచ్చే సమ్మె పిలుపులో కార్మికులందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఆపిలుపుకు కార్మికులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేవదానం, కోళ్ల వెంకటన్న, గుండన్న ,అదవన్న, వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.



గెట్ మీటింగ్ లో కార్మికులతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నేతలు

# క్రీడాకారులకు చేయూతనందిస్తున్న దాతలు

**ఉప్పునుంతల, మే 22 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 29 రోజుల నుంచి వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు స్థానికులు ఆర్థికంగా సహాయం అందిస్తున్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో శిక్షణ పొందుతు న్న కబడ్డీ శిక్షణ శిబిరాన్ని గ్రామానికి చెందిన కొంతమంది దాత లు సందర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. తమ గ్రామంలో వేసవి కబడ్డీ శిక్షణా శిబిరం నిర్వహించడం గర్వించదగ్గ విషయమ ని, తమ గ్రామాన్ని రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చే విధంగా క్రీడాకారులు ముందుకెళ్లాలని వారి ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, స్థానిక వ్యా యామ ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని వారి ప్రత్యేకంగా అభినం దించారు. క్రీడాకారులకు మొదటి వార్డు సభ్యులు కాసి రెడ్డి అవి తేజ్ రెడ్డి రూ.5 వేలు, ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు దే రెడ్డి రాంరెడ్డి రూ.2 వేలు, గంట సతీష్ కుమార్ రూ.3 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేసిన వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వారితోపాటు వార్డు సభ్యులు బూరం నరేష్ యాదవ్, గుద్దటి బాలరాజు, ఎండి సమ్మద్ తదితరులున్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న గ్రామస్తులు

## పిడుగుపాటుకు పశువులు మృతి



పిడుగు పడి మృతిచెందిన పశువులు

**అచ్చంపేట, మే,22 ప్రభాతవార్త:** పిడుగు పాటుకు పశువులు మృతి చెందిన ఘటన అచ్చంపేట మండల పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని నడింపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన బుద్ధుల శేఖర్ అనే రైతుకు చెందిన మూడు పశువులపై పిడుగు పడింది. రైతు శేఖర్ తన వ్యవసాయ పనుల నిమిత్తం ఆ పశువులను పొలంలో కట్టేసి ఉంచగా, రాత్రి వేళ పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. మృతి చెందిన వాటిలో కాడెద్దులు కూడా ఉన్నాయి. ఆ కాడెద్దులపైనే ఆధారపడి సదరు రైతు తన జీవనం సాగిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పిడుగుపాటు కారణంగా రైతుకు సుమారు రెండు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ఒక్కసారిగా జీవనాధారమైన పశువులు మృతి చెందడంతో ఆ రైతు కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. ప్రభుత్వం స్పందించి తమకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## అర్హులకు ఒంటరి మహిళ పెన్షన్లు

**జూన్ 2 నుండి కొత్త పెన్షన్లు :ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి**

**నవాబుపేట, మే 22 ప్రభాతవార్త :** అర్హులైన ఒంటరి మహిళలకు వచ్చేనెల జూన్ 2 నుండి పింఛన్లు అందజేయ బడతాయని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పెన్షన్లను త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు అందజేయపడతాయని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మహిళా సమాఖ్య భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలియజేశారు. అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు తెల్ల రేషన్ కార్డు కలిగి ఓటర్ ఐడి కార్డులో వయస్సు 57 సంవత్సరాలు మించి ఉన్న మహిళలు అర్హులని ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువపత్రము, సంబంధిత పత్రాలు, గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందించాలని త్వరలోనే మిగిలిన పెన్షన్ దారులకు పింఛన్లు అందేలా మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రభుత్వం పేదలకి ఇచ్చిన మాట ప్రకారం పథకాలను అమలు చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## ప్రజలకు ఇబ్బందులు
## కలగకుండా చర్యలు తీసుకోవాలి

**పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ : కమిషనర్ మురళి**



డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న కమిషనర్ మురళి

**అచ్చంపేట, మే,22 ప్రభాతవార్త:** అచ్చంపేట మున్సిపల్ పరిధిలో పారిశుధ్య విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మురళి అన్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి డ్రైనేజీలు పొంగి పొర్లాయి. శుక్రవారం ఉదయం కమీషనర్ పట్టణంలో ఎక్కడ ఇబ్బందిగా ఉందనే విషయంలో పరిశీలన చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వెంటనే డ్రైనేజీలు శుభ్రంచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా పనులు త్వరగతిగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ వివిధ దుకాణాల యాజమానులు చెత్త డ్రైనేజీలో వేయకుండా చెత్త బండికి వేసే విధంగా సహకరించాలని తెలిపారు. డ్రైనేజీలో చెత్త వేస్తే జరిమానాలు తప్పవు అన్నారు.

## గోపాల్ పేట నూతన ఎస్సైగా డి.శశిధర్

**గోపాల్‌పేట, మే 22 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా గోపాలపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై జగన్మోహన్ బదిలీపై వెళ్లినట్లు పోలీసు శాఖ వర్గాలు వెల్లడించాయి. అయన స్థానంలో నూతన ఎస్సైగా డి. శశిధర్ నియమితులయ్యారు. ఇప్పటికే ఆయన బాధ్యతలు స్వీకరించినట్లు సమాచారం. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది జగన్మోహన్ అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపారు. అలాగే నూతన ఎస్సై డి. శశిధర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. గోపాల్‌పేట మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని నూతన ఎస్సై పేర్కొన్నట్లు తెలిసింది.



## రిపోర్టర్ చంద్రశేఖర్ రెడ్డిని
## పరామర్శించిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

**పెద్దమందడి, మే 22 ప్రభాతవార్త :** పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి గ్రామానికి చెందిన నమస్తే తెలంగాణ రిపోర్టర్ చంద్రశేఖర్ రెడ్డి తండ్రి విట్టప్రతాప్ రెడ్డి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢసానుభూతి తెలిపారు. ఈసందర్భంగా మృతుని ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి వెంబడి మాజీజడ్పిటిసి రఘుపతిరెడ్డి, టిఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షులు వేణు యాదవ్, చిన్న రంగు శ్రీనివాస్ రెడ్డి, జానకి రాములు, గజ్జరాములు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

**లింగాల,మే 22 (ప్రభాతవార్త) :** ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని పద్మన్న పల్లి సర్పంచ్ శంకర్ సూచించారు. శుక్రవారం పద్మన్నపల్లి గ్రామ శివారులో పని ప్రదేశానికి స్వయంగా వెళ్లిన సర్పంచ్, కూలీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ ఎండల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో కష్టపడి పనిచేసే ఉపాధి హామీ కూలీల ఆరోగ్యం దృష్ట్యా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ఉదయం తొందరగా పనికి వచ్చి ఎండ తీవ్రత పెరగక ముందే పని ముగించుకుని వెళ్లాలని కోరారు. ప్రతి ఒక్కరూ పని ప్రదేశంలో మంచినీరు,నీడ ఉండేలా చూసుకోవాలని, నీరసంగా అనిపిస్తే వెంటనే ఓఆర్ఎస్ లవణాల ద్రావణాన్ని గాని మజ్జిగ తీసుకోవాలని కూలీలకు అవగాహన కల్పించారు .కూలీలు పని ప్రదేశంలో డీహైడ్రేషన్ (నీరసం) బారిన పడకుండా ఈఆర్ఎస్ ప్యాకెట్లు వెంటనే దోహదపడతాయని పేర్కొన్నారు. కఠినమైన ఎండల్లో తమ ఆరోగ్య పరిస్థితిని గుర్తించి, అండగా నిలిచిన సర్పంచ్ ఉపాధి కూలీలు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, డిప్యూటీ సర్పంచ్ దేవి వెంకట్రాం,వార్డు మెంబర్ చందు పద్మ మాజీ సర్పంచ్ దేవి సేవ్య, నాయకులు రాములు,వెంకటరెడ్డి, పులియా, బాలస్వామి, శంకర్, వాల్యా,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేసిన దృశ్యం

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదు

**- మున్సిపాలిటీ సిబ్బంది హాజరు పట్టిక పరిశీలన**

**- కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్**

**కల్వకుర్తి, మే 22 (ప్రభాతవార్త):** విధుల పట్ల మున్సిపాలిటీ సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలోని వివిధ ఛాంబర్లను చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, 22వ వార్డు కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఎంత మంది రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు వారి హాజరు శాతం పట్టికను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. మున్సిపాలిటీ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించి ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ వెంట మున్సిపాలిటీ కార్యాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్

## కేంద్ర ప్రభుత్వం గ్రామాలు అభివృద్ధి

**బీజేపీ మండల అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి**

**మదనాపురం, మే 22 (ప్రభాతవార్త) :** కేంద్ర ప్రభుత్వం గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలో తిరుమలాయపల్లి గ్రామంలో సిసి రోడ్ నిర్మాణానికి మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో మంజూరు ఐదు లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు గ్రామ సర్పంచ్ పోతురాజు రాములు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పనలో భాగంగా సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సిసి రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొగ్గు రాజు, వార్డ్ నెంబర్ సభ్యులు బురాన్, రాఘవులు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ యాదవ్,కొండ వెంకటేశ్వర శెట్టి, డబ్బు కురుమన్న, మేస్త్రి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామ సర్పంచ్

## 150 పడకల ఆసుపత్రికి, రహదారి సర్వే

**మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు చర్యలు**

**మక్తల్ టౌన్, మే 22 (ప్రభాతవార్త) :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 150 పడకల ఆసుపత్రికి ప్రజలు చేరుకునేలా హైవేతో పాటు ఇతర నలువైపులా రహదారుల నిర్మాణం కోసం శుక్రవారం అధికారులు సర్వే నిర్వహించారు. ఇటు హైవే నుంచి 150 పడకల ఆసుపత్రి కి, మరోవైపు మైనారిటీ కాలనీ నుంచి ఆసుపత్రి చేరుకునేలా, ఇంకోవైపు ఖానాపూర్ రోడ్ నుంచి పంప్ హౌస్ మీదుగా ఆసుపత్రి చేరుకునేలా... మొత్తం నలువైపులా ఆసుపత్రికి రహదారులను ఏర్పాటు చేసి, కనెక్టివిటీ లో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు అధికారులు సర్వే చేసి, రహదారులను గుర్తించి, అతి త్వరలో సీసీ రోడ్లు ఏర్పాటు చేసి, ఆసుపత్రి కి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు.సర్వే చేసిన వారిలో అధికారులు రాజన్న,మహేష్,పాల్గొనగా, కాంగ్రెస్ నాయకులు రవికుమార్ వారి వెంట ఉన్నారు.



ఆసుపత్రి నిర్మాణానికి సర్వే చేస్తున్న అధికారులు

# అన్నాసాగర్‌లో ఈదురుగాలుల బీభత్సం

**కూలిపోయిన విద్యుత్ స్తంభాలు.. భయాందోళనలో గ్రామస్తులు**

**దామరగిద్ద, మే 22 (ప్రభాతవార్త) :** దామరగిద్ద మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో ఈదురుగాలులు తీవ్రబీభత్సం సృష్టించాయి. భారీ గాలుల ధాటికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలిపోగా, ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. విద్యుత్ తీగలు రహదారులపై పడిపోవడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఘటన జరిగి గంటలు గడుస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్పందించకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలకు ముప్పుగా విద్యుత్ తీగలు రోడ్లపై పడివున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. "ఏదైనా ప్రాణ నష్టం జరిగితే బాధ్యత ఎవరిది..?" అంటూ ప్రశ్నిస్తున్నారు. గ్రామం లో చిన్నపిల్లలు, రైతులు, పశువులు సంచరించే ప్రాంతాల్లోనే విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రమాద కరంగా ఉన్న విద్యుత్ తీగలు, కూలిపోయిన స్తంభాలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులను డిమాండ్ చేస్తున్నారు.



కూలిపోయిన విద్యుత్ స్తంభాలు

**భారీ ఈదురుగాలుల బీభత్సం.. ఇండ్లపై కూలిన వేపచెట్లు**

**నారాయణ పేట, మే 22 (ప్రభాతవార్త) :** నారాయణపేట పట్టణంలో అతి భారీ ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. బలమైన గాలుల ధాటికి హరిజనవాడ ప్రాంతంలో రోడ్డు పక్కన ఉన్న భారీ వేప చెట్టు ఇండ్లపై కూలిపోవడంతో గోడలు ధ్వంసమై భారీ నష్టం సంభవించింది. యాదగిరి రోడ్డులోని హరిజనవాడలో చెట్లు విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ స్తంభాలు దెబ్బతిని కేబుళ్లు తెగిపోయాయి.దొండే ప్రభు, దొండే తిప్పన్న ఇండ్లపై పెద్ద వేపచెట్లు పడటంతో గోడలు కూలిపోయినట్లు స్థానికులు తెలిపారు. రాత్రి సమయంలో ఘటన జరగడం, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చిన్నపిల్లలు ఆడుకునే ప్రాంతంలో ఈఘటన జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద నిలిపి ఉంచిన కారు పై చెట్టు కూలిపోవడంతో కారు అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయ్యపూల రాజు, వెంకటేష్‌కు చెందిన కారుకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. యాదగిరి రోడ్డులోని బేస్‌బాల్ కోర్టు కూడా ఈదురుగాలుల ప్రభావానికి దెబ్బతిన్నట్లు తెలిసింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెట్లు రోడ్లపై పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ ఘటనను పరిశీలించిన రైతు నాయకులు, ఆకుల వెంకటప్ప ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఇండ్లపై కూలి పడిపోయిన భారీ వృక్షం

# పట్టణ సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన

**ఆత్మకూర్ మే 22, (ప్రభాతవార్త);** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తూ మున్సిపల్ ఇంచార్జి అశోక్ సాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆపార్టీ సబ్‌డివిజన్ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో అటు ప్రభుత్వ యంత్రాంగం ఇటు పాలకవర్గం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇందిరమ్మ మొదటి విడత నిర్మాణాలను పూర్తి చేసుకున్నప్పటికీ ప్రభుత్వం విధించిన నిబంధనల మూలంగా అర్హులు బిల్లులుపొందలేకపోతున్నారని ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను సడలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణంలో రెండు, మూడు రోజులకు ఒకసారి మంచినీటి సరఫరా జరుగుతుందని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రధాన అర్వదారి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేస్తామంటూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పాలకవర్గం విస్మరిస్తుందని అంతేకాకుండా సిసి రోడ్డు నిర్మాణాలకు తక్షణమే భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల సమయంలో పేద ప్రజలకు గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్ పథకం పకడ్బందీగా అమలు చేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఇప్పటివరకు ప్రజలకు పథకాలు అందకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. వచ్చే నెల రెండవ తేదీన కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అర్హులను గుర్తించి తక్షణమే లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం చేపట్టాలని రెండవ విడత ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ఎంపిక చేయడంతో పాటుగా లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇసుక సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వ అధికారులు చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం మున్సిపల్ ఇన్చార్జికు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకటన్న, రాములు, భగవంతు తదితరులతో పాటుగా పలువురు ప్రజలు పాల్గొన్నారు.




వినతి పత్రం అందజేస్తున్న సిపిఐ ఎంఎల్‌మాస్ లైన్ నాయకులు

## విద్యార్థులను అభినందించిన కలెక్టర్



విద్యార్థులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**ఆత్మకూర్ మే 22, (ప్రభాతవార్త);** ఆత్మకూరు పట్టణంలోని శ్రీవాణి పాఠశాలకు చెందిన విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన దీప్తి 579, బోజుడు తదితర విద్యార్థిని విద్యార్థులను శుక్రవారం రోజు జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి జిల్లా విద్యాధికారి అబ్దుల్ కని తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని ఆత్మకూర్ లోని శ్రీవాణి పాఠశాల చెందిన విద్యార్థిని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించడమే కాకుండా పట్టా సర్టిఫికెట్లు అందజేసి భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థిని విద్యార్థులు మార్గ నిర్దేశంతో ముందుకు సాగాలని సూచించినట్లుగా పాఠశాల కరస్పాండెంట్ గంగాధర్ ప్రభాతవార్తకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతోపాటుగా పాఠశాలయాజమాన్యం లత, గంగాధర్ తో పాటుగా ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ క్రీడాకారిణిగా స్వరూప



స్వరూపకు చెక్కును అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి

**గోపాల్ పేట, మే 22 (ప్రభాతవార్త) :** జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అదేవిధంగా జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ గని చేతుల మీదుగా జిల్లా ఉత్తమ క్రీడాకారిణిగా ఎంపికైన స్వరూపకు పదివేల రూపాయల చెక్ అందుకుంది. గోపాల్‌పేట జిల్లా పరిషత్ హై స్కూల్ ఫుట్‌బాల్ క్రీడాకారిణి స్వరూపను జిల్లా కలెక్టర్ అభినందించి క్రీడారంగంలో ఇంకా ఉన్నత స్థాయికి వెళ్లాలని అదేవిధంగా తల్లిదండ్రులను సమాజంలో తల ఎత్తుకునే విధంగా చేయాలని స్వరూపను ప్రోత్సహించారు.

# ఆటోను నడిపి అబ్బుర పరిచిన అదనపు కలెక్టర్

**-మద్దిగట్లలో ఉపాధి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్**

**భూత్పూర్,మే 22,(ప్రభాతవార్త) :** జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) మధుసూధన్ నాయక్ శుక్రవారం ఉదయం భూత్పూర్ మండలం మద్దిగట్లలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్)కింద చేపట్టిన పనులను పరిశీలించారు.ఈ పథకం కింద గ్రామంలో చేపట్టిన పనుల పురోగతి,పనుల నాణ్యత,కూలీలు,కార్మికుల హాజరు పట్టిక వంటి అంశాలను అడీషనల్ కలెక్టర్ తనిఖీ చేశారు.అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్ కాసేపు ఉపాధి కూలీలతో ముచ్చటించారు.కూలీలను చేరవేస్తున్న ఆటోను మద్దిగట్లగ్రామ సర్పంచిని కూర్చోబెట్టుకుని కాసేపు నడిపి(తోలి) అడీషనల్ కలెక్టర్ అందరిని అబ్బుర పరి చారు.ఉపాధి పను లకు గ్రామం నుంచి మరింత మంది కూలీల బాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని,గ్రామ ప్రజలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పనుల్లో నిమగ్నమై తద్వారా ఉపాధిని పొందే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నత్తి సురేష్,పంచాయతీ కార్యదర్శి ఇతర అధికారులు,ఉపాధి కూలీలు,గ్రామస్తులు పాల్గొన్నారు.



మద్దిగట్లలో ఉపాధి పనుల వద్ద ఆటోను తోలుతున్న అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్



మద్దిగట్లలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

# బిజెపి పార్టీ ఆధ్వర్యంలో కల్వకుర్తి ఆర్డీవోకు వినతిపత్రం..

**కల్వకుర్తి, మే 22 (ప్రభాతవార్త):** ఉల్పర నుండి కల్వకుర్తి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ శుక్రవారం భారతీయ జనతా పార్టీ వంగూరు, కల్వకుర్తి మండల శాఖ ఆధ్వర్యంలో ఆర్డీఓ జనార్దన్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. వంగూరు మండల బిజెపి నాయకులు చేపట్టిన 21 కిలోమీటర్ల మహా పాదయాత్రకు సంఘీభావంగా కల్వకుర్తి బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆర్డీవో జనార్దన్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి బిజెపి జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన ఉల్పర బ్రిడ్జి, డబుల్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సొంత ఊరికి 4 నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు చేయడం సంతోషకరమని మిగతా గ్రామాలలో కూడా అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు వేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిజెపి నిరంతరం పోరాడుతుందని, ఈ సమస్య పరిష్కరించని యెడల చలో అసెంబ్లీకి పిలుపునిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగూరు మండల పార్టీ అధ్యక్షులు గున్న ఆనంద్ రెడ్డి, భీమయ్య, అంజి యాదవ్, కల్వకుర్తి బిజెపి నాయకులు మొగిలి దుర్గాప్రసాద్, బోడ నర్సింహ, సురేందర్ గౌడ్, గంగాధర్, నరెడ్ల శేఖర్ రెడ్డి, శ్రీశైలం, పానుగంటి శివ, వెంకటస్వామి, సైదులు, తదితర మోర్చ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




ఆర్డీఓ జనార్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## డీజీపీగా పదోన్నతి పొందిన వీసీ సజ్జనార్‌కు శక్తి ఫౌండేషన్ ఘన సన్మానం



విసి సజ్జనార్‌ను కలిసిన శక్తి ఫౌండేషన్ సభ్యులు

**నారాయణపేట, మే 22 (ప్రభాతవార్త) :** నారాయణ పేట జిల్లా ఉట్కూర్ గ్రామానికి చెందిన శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చింతన్ పల్లి శివ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు అదనపు డీజీపీ హోదా నుంచి డీజీపీ హోదాకు పదోన్నతి పొందిన సందర్భంగా వి.సి. సజ్జనార్ ను శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్-2026లో వీసీ సజ్జనార్‌కు డీజీపీ హోదా పదోన్నతి కల్పించిన నేపథ్యంలో ఈ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమాజ సేవ, ప్రజల భద్రత కోసం ఆయన చేసిన సేవలను కొనియాడుతూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ఎంపీడీవో విజయసింహారెడ్డి**

**ఖిల్లాగణపురం మే 22, (ప్రభాతవార్త);** పరిసరాల పరిశుభ్రతతో పాటు పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో విజయసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో ప్రజా ప్రతినిధులు యువకులు అధికారులతో కలిసి శ్రమదానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా ప్రాంగణంలో కంప చెట్లను పిచ్చి మొక్కలను తొలగించారు శ్రమదానం చేసి చెత్తను తొలగించడం జరిగింది. వారంలో ఒకరోజు యువకులు ప్రజాప్రతినిధులు శ్రమదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలను చైతన్యవంతం చేసి శ్రమదానంలో పాల్గొనే విధంగా చూడాలని చెప్పారు. అనంతరం బీటీ రోడ్డు నుండి క్రీడా ప్రాంగణం వరకు రోడ్డుకు ఇరవై వేల కంపచెట్లను తొలగించి నీళ్లను పోశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి...

**ఇంకా ఏ కాలంలో బతుకుతున్నాం...**

**బీసీ, ఎస్సీ, ఎస్టీలు అంటే అంత చులకన భావన ఎందుకు?**

**బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**

**వనపర్తి, మే 22, (ప్రభాతవార్త):** గ్రామ బహిష్కరణ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దమందడి మండలంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో మండల కేంద్రం చేయాలనే తలంపుతో జంట గ్రామాలైన బలిజపల్లి, జంగమయ్యపల్లి ని గుర్తించడం జరిగిందన్నారు. అందుకోసం ఎమ్మెల్యే మేఘా రెడ్డి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి లెటర్ రాయడంతో కలెక్టర్ తదుపరి చర్యలను ముందుకు తీసుకోవడం జరిగిందన్నారు. కానీ అప్పట్లోనే కొందరు తమ గ్రామాలను మండల కేంద్రంగా చేయవద్దని కొన్ని రోజులు ధర్నాలు జరపగా..వారికి ఎలాంటి ఆంక్షలు విధించకుండా ప్రశాంతంగా ధర్నాలు చేసుకునేలా పోలీసులు, అధికారులు అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సమస్య అక్కడితో సమసి పోగా ఇటీవల జంట గ్రామాల్లో జరగబోయే బొడ్రాయి పండుగకు కొందరు గ్రామ ఆధిపత్య వ్యక్తులు మండల కేంద్రాన్ని చేయాలని తపించిన 9 మందిని గ్రామ బహిష్కరణ చేస్తూ దూరం పెట్టడం జరిగిందన్నారు.బొడ్రాయి పండుగ అవసరాల కోసం గ్రామస్తులు డబ్బు పోగు చేసుకునే క్రమంలో ఈ తొమ్మిది మంది వ్యక్తులతో డబ్బులు తీసుకోవద్దని వారిని బహిష్కరిస్తున్నట్లు చెప్పి, వారిలో నుంచి అగ్రవర్ణాలకు చెందిన ఒక వ్యక్తితో మాత్రం చందాలు తీసుకోవడం కుల దురహంకారానికి నిదర్శనం అన్నారు. స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అవుతున్నా నేటికి కుల వివక్ష పోవడం లేదని, అంతేకాకుండా తొమ్మిది మందిపై దాడి చేసే కుట్ర జరగడం అవివేకమన్నారు. 9 మందిలో ఒకరైన రమేష్ గౌడ్ గతంలో రెండు పర్యాయాలు సర్పంచిగా, ఒకసారి జడ్పిటిసి సభ్యునిగా పని చేశారని, అలాంటి వ్యక్తి గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలనుకోవడం తప్పా? అని ప్రశ్నించారు. మండల కేంద్ర ఆమోదం కోసం లెటర్ రాసిన ఎమ్మెల్యే, గ్రామస్తులు బాగానే ఉన్నారు కానీ మండల కేంద్రం చేయాలని తపించిన 9 మందిని ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు.ఈ సమస్యపై ధర్నా చేస్తున్న వారిపై ఎందుకింత వివక్ష అని, అధికార పార్టీకి చెందిన నాయకులకే ఇంతటి ఇబ్బంది కలిగితే సామాన్యుల పరిస్థితి ఏంటో ఒకసారి ప్రజలు గుర్తించాలన్నారు. తప్పులు చేసిన వారు బాగానే ఉంటున్నారు కానీ తప్పును తప్పుగా చూపిన వ్యక్తులను అరెస్టు చేసి స్టేషన్ కు తరలించడం అగ్రవర్ణ దురహంకారానికి నిదర్శనం అన్నారు. ప్రతిపక్ష నాయకులు, మాజీ మంత్రి బంధుగణం ధర్నాలు చేస్తే అనుమతి ఇచ్చే పోలీసులు మరి వీరిపై ఎందుకు ఇంత ఖర్గశంగా వ్యవహరిస్తున్నారని, ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు.వనపర్తి జిల్లాలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి పూర్తిగా గతి తప్పుతుందని విమర్శించారు. బీసీ ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న దాడులు కుల వివక్ష పై ఎస్సీ కమిషన్, బీసీ కమిషన్, మానవ హక్కుల సంఘానికి వెళ్లి ఫిర్యాదు చేస్తామని, అంతటితో ఆగకుండా ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల సంఘానికి వెళ్లి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యుడు రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ చీర్ల విజయ చందర్, బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాచాల

# అర్జీలని సత్వరం పరిష్కరించి న్యాయం చేయాలి

- ప్రజాపాలనకు నిజమైన అర్థం
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- వనపర్తి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం : వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



చిన్నారులకు వినికిడి పరికరాలు అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

**వనపర్తి,ప్రతినిధి, మే 22, ప్రభాతవార్త:** దళారీ వ్యవస్థ అనేది సమూలంగా లేకుండా చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల అర్జీలపై నిరక్ష్యం వద్దని, వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిజూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరం నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితోపాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి,జిల్లా ఎస్పీ సునీతరెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఉన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు తోడుగా అదనంగా మరిన్ని పథకాలను ప్రజలకు అందిస్తుందని తెలిపారు. విద్యా వైద్యంపై ప్రధాన దృష్టి సారించి, వీటికి ప్రధానంగా నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు.ప్రజల అర్జీలను, దరఖాస్తులను వేగంగా పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. దళారీ వ్యవస్థ అనేది సమూలంగా లేకుండా చేయాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల అర్జీలపై నిరక్ష్యం వద్దని, వాటిని వేగంగా పరిష్కరించాలని తెలిపారు. ఎటువంటి సమస్య లేకుండా భూభారతి కి సంబంధించి రైతుల నుంచి వచ్చే అర్జీలను శరవేగంగా పరిష్కరించాలని సూచించారు. ఇక ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు పరిమితులకు లోబడి ఇండ్లను నిర్మించుకోవాలని, పరిమితికి మించి ఇండ్ల నిర్మాణం చేసుకోవడం ద్వారా తిరిగి అప్పులపాలయ్యే అవకాశం ఉంటుందనిఆ దిశగా అధికారులు పర్యవేక్షణ సాగించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై ప్రతి వ్యక్తికి సరైన సమాచారం అందాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో 65 ఏళ్లలో కేవలం రాష్ట్ర అప్పురూ. 65 వేల కోట్లు ఉంటే, గత ప్రభుత్వం పది ఏళ్లలో 8 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాటిని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. యువత పక్కదారి పట్టకుండా, డ్రగ్స్ వైపు మల్లకుండా క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర ఏళ్లలో ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిందని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేయడంలో బాగా పనిచేస్తున్న అధికారులకు ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. పాలమూరు బిడ్డ రేవంత్ రెడ్డి సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి సంతకం మహిళా శక్తి పథకంపై చేశారని తెలిపారు. తద్వారా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పదివేల కోట్ల రూపాయలు మహిళా శక్తి పథకం కోసం మహిళల ప్రయాణం కోసం ఖర్చుపెట్టిందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటును గృహ జ్యోతి పథకం కింద ప్రభుత్వం పేదలకు అందించి పేదలకు కరెంటు కష్టాలు తీర్చిందని తెలిపారు. రైతు భరోసా పెట్టుబడి సాయం కింద గతంలో ఎకరాకు పదివేల రూపాయలు ఇస్తే, ఇప్పుడు దాన్ని ఎకరాకు 12 వేల రూపాయలకు పెంచామని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో 15 బస్సులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. వనపర్తి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఒక్క పూరి కూడా లేకుండా ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు ఉండాలని లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని, తద్వారా పేదల సొంతయింటి కల నెరవేరుస్తోందని తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు లక్ష ఇండ్ల గృహ నిర్మాణాలతో చరిత్ర సృష్టించబోతున్నామని తెలిపారు. వనపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ పరిధిలో రహదారుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వనపర్తి లో 70 కోట్ల రూపాయలతో అందరికీ మంచినీటి సౌకర్యం అందించేందుకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. 47 కోట్ల రూపాయలతో వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలల భవన నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా యూనియన్ బ్యాంక్ సిఎస్ఆర్ నిధులతో వనపర్తి జిల్లా ఆసుపత్రిలో రెండున్నర కోట్ల రూపాయలతో సిటీ స్కాన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు ఎల్పిజి కనెక్షన్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేసి,ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. .కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు రుణ మాఫీ పథకం ద్వారారూ.61,687 మంది రైతులకు రూ.491 కోట్ల లబ్ది చేకూర్చడం జరిగింది అన్నారు. రైతు భరోసా కింద 1,83,839 మంది రైతులకు రూ. 140 కోట్ల పెట్టుబడి సాయం అందించమన్నారు. 2025 ,26 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 50,585 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించి వారి ఖాతాల్లో నగదు వేసినట్లు తెలిపారు. వనపర్తి జిల్లాలో 1,82,262 రేషన్ కార్డులు ఉండగా వాటిలో 73,214 కార్డులు ప్రజా ప్రభుత్వంలో కొత్తగా జారీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 84,830 లబ్ధిదారులకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించి కరెంటు బిల్లుల భారం తగ్గించిందాన్నారు. అదేవిధంగా జిల్లాలో మొత్తం 6,094 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి సొంతం ఇంటి కల నెరవేర్చమన్నారు. జిల్లాలో మొత్తం 8,258 స్వయం సహాయక సంఘాలకు రూ.28 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మహిళలకు 97,076 ఏకరూప చీరలు, 70,516 మందికి చేయూత పెన్షన్‌లు అందించడం జరిగిందన్నారు. విద్యాశాఖ పై ప్రత్యేక చొరవ తీసుకున్న ప్రభుత్వం గతేడాదితో పోలిస్తే పదో తరగతి ఫలితాల్లో మెరుగైన స్థానాన్ని సాధించిందని తెలిపారు. 97ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 19వస్థానాన్ని సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా బాల భరోసా కార్యక్రమం కింద జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ల సంయుక్త ఆధ్వర్యంలో 16 మంది చిన్నారులకు వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం వనపర్తి, చిన్నంబావి మండలాలకు చెందిన మహిళా సమాఖ్యలకు ఇందిరా మహిళా శక్తి కింద బస్సులను అందజేశారు.జిల్లా వ్యవసాయ శాఖఆధ్వర్యంలో పలువురు రైతులకు పచ్చిరొట్ట, జీలుగా విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్, ఫోటో ప్రదర్శనల్ని ముఖ్యఅతిథులు సందర్శించి పరిశీలించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయం ఛైర్మెన్ గోవర్ధన్ సాగర్, వనపర్తి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ మాధవి, పెబ్బేరు మునిసిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కొత్తకోట మునిసిపల్ ఛైర్పర్సన్ అరుణ,ఆత్మకూరు మునిసిపల్ ఛైర్పర్సన్‌నాగమణి, అమరచింత మునిసిపల్ ఛైర్పర్సన్ సువర్ణ, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ శ్రీనివాస్ గౌడ్,ఆర్డివో సుబ్రహ్మణ్యం,ఇతరప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా విజయోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలలు కళాశాలల నుండిఅత్యుత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులతో కలిసి విచ్చేసిన 80 మంది విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. అదేవిధంగా, పదో తరగతి, ఇంటర్మీడియట్, క్రీడల్లో జిల్లాలోని అత్యుత్తమంగా ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున నగదు బహుమతి చెక్కులను అందజేశారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి నరేంద్ర కుమార్, ఇతర విద్యాశాఖ అధికారులు,విద్యార్థులు, తల్లిదండ్రులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులమంటూ లిఫ్ట్ అడిగి.. దారి మధ్యలో బెదిరించి దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

సంజన్నను కర్రలతో దాడి చేసి అతని వద్ద ఉన్న రూపాయలు రెండు వేల నగదు తీసుకొని,అనంతరం ఫోన్ పే ద్వారా 36వేల రూపాయలను వేరే ఖాతాకు బదిలీ చేయించారు. తదనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. గాయాల పాలైన బాధితుడు ఎస్‌పిఎస్ దవాఖానాలో చికిత్స పొంది అనంతరం జడ్చర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీస్ అధికారులు తమ తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఉదయం అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకితీసుకొని విచారించగా నేరం తామే చేసుకున్నట్లు ఒప్పుకున్నారు.నిందితులు మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన అప్పన్న, రాకేష్‌లుగా గుర్తించి అప్పన్న వద్ద19000 రాకేష్ వద్ద 10,000మొత్తం 29,000 ఒక స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి వెల్లడించారు. మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ ఆదేశాల మేరకు జడ్చర్ల సిఐ కమలాకర్, ఎస్సై ఖాదర్ ఆధ్వర్యంలో నిత్యం తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ఉపాధి పనులకు వెళ్ళి.. ప్రమాదవశాత్తు బావిలోపడి మహిళ మృతి

(మొదటి పేజీ తరువాయి)



గోవిందమ్మ (ఫైల్)

రూ. 50వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ విషయం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి దృష్టికితీసుకెళ్తామని ప్రభుత్వం తరఫున సహాయం అందేలా చూస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. మార్కెట్ వైస్ ఛైర్మన్ తిరుపతిరెడ్డి,కావలిసాయిబాబా, మాజీ జడ్పిటిసికృష్ణయ్య, సర్పంచ్‌మల్లేష్, కరుణాకర్ రెడ్డి, సిపిఎం నాయకులు తదితరులు కుటుంబాన్ని పరామర్శించారు.

## సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మకు ఘన నివాళి

**దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహానీయుడు భాగ్యరెడ్డి వర్మ : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి ప్రతినిధి, మే 22,ప్రభాతవార్త:** దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహానీయుడు భాగ్యరెడ్డి వర్మ అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోభాగ్యరెడ్డి వర్మజయంతిని పురస్కరించుకొని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి అనగారిన వర్గాల శ్రేయస్సు కోసం భాగ్యరెడ్డి వర్మకృషి చేశారన్నారు. బాల్య వివాహాలు, అంటరానితనం, దేవదాసి, జోగిని వ్యవస్థలను రూపు మాపేందుకు పోరాటం చేశారని కొనియాడారు. దళిత ఉద్యమ పితా మహుడిగా, సంఘ సంస్కకర్తగా భాగ్యరెడ్డి ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచాని,సమాజంలో దళితుల చైతన్యం కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మహానుభావుల జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని, మహానీయుల చరిత్ర, త్యాగాలను బావి తరాలకు అందించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని, దేశ భవిష్యత్తు, ప్రజల సంక్షేమం కోసం మహానీయులు ఆచరించినమార్గాలను భావితరాలకు అందిస్తూ ముందుకు తీసుకెళ్లాలన్నారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీ రావు, మహనీయుల ఉత్సవ కమిటీ ఛైర్మెన్ గంధం నాగరాజు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వారసత్వ సంపదను కాపాడుదాం

- వారసత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి
- పిల్లలమర్రి వద్ద పరిశుభ్రత కార్యక్రమం

**మహబూబ్ నగర్,మే 22 ప్రభాతవార్త :** వారసత్వ ప్రదేశాల పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం అవసరమని వారసత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పిల్లలమర్రి వద్ద జిల్లా పర్యాటక శాఖ వారసత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలమర్రి లోపల పరిసర ప్రాంతాలను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వారసత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి, పిల్లలమర్రి మ్యూజియం సిబ్బంది, జిల్లా పర్యాటక శాఖ సిబ్బంది, టూరిజం సిబ్బంది పాల్గొని పరిసరాల పరిశుభ్రత, వారసత్వ కట్టడాల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మూడవత్ హరికిషన్ నాయక్**

**వెల్దండ, మే 22 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మూడవత్ హరికిషన్ నాయక్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హరికిషన్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 2న 2 లక్షల మందికి ఆసరా పెన్షన్ లు మంజూరు చేయనున్నట్లు ఈనెల 22 నుండి 25 వరకు మండలంలోని ఆయా గ్రామపంచాయతీలో 58 సంవత్సరాలు పైబడిన వారు తోపాటు వృద్ధాప్య, వితంతు, గీత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీంతోపాటు రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో వెల్దండ మండలానికి పెద్ద మొత్తంలో మంజూరు కానున్నట్లు ఆయా గ్రామ పంచాయతీలలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈదులపల్లి శీను,, గోపాల్ నాయక్ తదితరులు ఉన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, కలెక్టర్

కలిగిన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా లాంచ్ అనంగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగాప్రభుత్వం ప్రతి నియోజక వర్గంలో 3వేల 500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, జూన్ రెండో తేదీన ఒకలక్ష ఇండ్లు గృహప్రవేశాలుజరగనున్నాయని, ముఖ్యమంత్రి అదిలాబాదులో గృహప్రవేశాల కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు మంత్రి తెలిపారు. పాలమూరు ప్రాంతం ఎన్నో దశాబ్దాలుగా సాగునీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ఈ ప్రాంత రైతుల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలంటే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కీలకమని పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాజెక్టుకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్ల పనులు నెమ్మదించాయని ఆయన విమర్శించారు.ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్ష కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేసినప్పటికీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను నిరక్ష్యం చేశారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా ప్రజాప్రతినిధులు మరియు అధికారులు వారధిగా పని చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు,ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు జిల్లాలోని ప్రతి అర్హుడైన లబ్ధిదారునికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మార్చి 6వ తేదీ నుంచి జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల అమలులో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలుఅందించడంలో కీలకపాత్ర పోషించారని కలెక్టర్ ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సూచనల మేరకు జిల్లాలోని వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 5,000 ఫైళ్లను రానున్న 15 రోజుల్లో పూర్తిస్థాయిలో క్లియరెన్స్ చేసే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతి శాఖ అధికారి పెండింగ్ దరఖాస్తులు, ఫైళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయడం ప్రతి ప్రభుత్వ అధికారుల బాధ్యత అని కలెక్టర్ తెలిపారు.అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని ఆయన కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవా దృక్పథంతో పనిచేస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు సాకారం అవుతాయని కలెక్టర్ హేమంత కేశవ్‌పాటిల్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్ దేవ సహాయం,నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి ,ప్రజా ప్రతినిధులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం
- పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ,మేయర్









మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి.జానకి , మేయర్ గుమ్మాల మమత

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 22, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక99 రోజుల కార్యక్రమంద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా అధికారులు,ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, దేవరకద్ర శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే"ప్రజల వద్దకే పాలన" అనే లక్ష్యంతో ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు.రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులకార్యాచరణ ద్వారా ఒక మహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలను నేరుగా కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించి,అర్హులైన వారికి పారదర్శకంగా ఫలాలు అందిస్తున్నారని చెప్పారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం, విశ్వాసం పెరిగిందని అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం వల్ల ప్రతి కుటుంబానికి నెలకు సుమారు రూ.1,136 ఆదాఅవుతోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా ద్వారా రుణమాఫీ, రైతుబీమా కిందరైతు మరణిస్తే కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతంగా అమలవుతోందని, ప్రతి గ్రామంలో కనీసం 10 నుంచి 15 మంది పేదలు ఇళ్లు నిర్మించుకుంటున్నారని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.5లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు.జిల్లాలో రేషన్ కార్డులు లేని వారికి 1,06,000 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, 96,000 క్వింటాళ్ల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి మండలం, నియోజకవర్గ స్థాయిలో 50 పడకల,100 పడకల ఆసుపత్రులను నిర్మిస్తున్నామని వెల్లడించారు.విద్యా రంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ క్లాసులు, డిజిటల్ బోర్డులు, ఆన్‌లైన్ తరగతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు.ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ స్థాయి వరకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందించే పథకాన్ని కూడా ప్రభుత్వం జూన్ 12 నుండి అమలు పర్చేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వచ్చేవిద్యా సంవత్సరంలో"బడిబాట" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచాలని అధికారులను ఆదేశించారు.ప్రతి నియోజక వర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రభుత్వం ప్రారంభిస్తోందని తెలిపారు. జూన్ 2 తర్వాత ప్రభుత్వం మరిన్ని కొత్త పథకాలను తీసుకురానుందని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పెన్షన్లు,ఇందిరమ్మ ఇన్సూరెన్స్ పథకాలు త్వరలో అమల్లోకి వస్తాయని వెల్లడించారు.పోలీస్ శాఖ రాష్ట్రంలో శాంతిభద్రతలను సమర్థవంతంగా నిర్వహిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిసై అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు.రైతులు పండించే ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పారిశుధ్యం, వైద్యం, విద్య, వ్యవసాయం, ఇరిగేషన్, యువజన సంక్షేమం, క్రీడలు, పర్యాటకం, పర్యావరణం,రోడ్డు భద్రత, రైతు సంక్షేమం వంటి అనేక అంశాలపై ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు చేరవేసి, అర్హులైన వారికి ఫలాలు అందించే బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సరైన పర్యవేక్షణ, సమర్థవంతమైన అమలు ఉంటేనే సంక్షేమ పథకాల అసలు ప్రయోజనం పేదలకు అందుతుందని పేర్కొన్నారు.

సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. వివిధ శాఖలు అమలు చేస్తున్న పథకాల వివరాలను ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగానే జిల్లాస్థాయి సమావేశం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.అధికారులు ప్రజలతో సమర్థవంతమైన కమ్యూనికేషన్ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఏమిటి, వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అర్హతలుఏమిటి అనే విషయాలను ప్రజలకు స్పష్టంగా వివరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, విద్యాశాఖ, వ్యవసాయశాఖ తదితర శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశాలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ డి. జానకి మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే యువత, విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

మేయర్ గుమ్మాల మమత మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ చారిత్రాత్మక కార్యక్రమమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం కలిగిందని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల వివరాలను సమావేశంలో వివరించారు.ఈ సమావేశంలో మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బి. అనిత మధుసూదన్ రెడ్డి, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల్‌కోటి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,డీఆర్వో రామ్‌రెడ్డి,జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**స్టాళ్ల ప్రదర్శన :** సమావేశానికి ముందు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తా తో కలిసి కలెక్టరేట్ ప్రాంగణంలో వైద్య ఆరోగ్యం, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవన శాఖల ద్వారా ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాళ్లను సందర్శించి ప్రారంభించారు. ఈ స్టాళ్ల ద్వారా ఆయా శాఖాలు అమలుపరుస్తున్న వివిధ పథకాలు గురించి, ప్రభుత్వం అందిస్తున్న సేవలు,సబ్సిడీ పరికరాలగురించి ప్రదర్శించారు. అలాగే గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులుతయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు